౯౧

# గూఢచారి వెంకటచలం

D-I-26 చాణక్యపురి అన్నది ఢిల్లీలో ఒక చిరునామా.

8-మే అన్నది కేలెండర్‌లో ఒక తేది.

మధ్యాహ్నం నాలుగు గంటల వేళ.

ఆ తేదీనాడు ఆ చిరునామాగల ఇంటి మేడ వాటాలో పెద్దగది.

ఆగదిలో చాలమంది కూర్చుని ఉన్నారు. అయినా నిశ్శబ్దం, వేడిగాలిని పంచుతున్న పంకా చప్పుడు, ఉండుండి కీచుమని టెలిఫోన్ కేక. ఇంటి బయట కాస్త దూరంగా నల్లటితారును, కంకరునూ కలిపి త్రొక్కుతున్న రోడ్‌రోలర్ రొద.

గదిలో ఒక గోడపైన వేలాడుతున్న ఫ్రేములో ఒక స్వాగతపత్రం ... "మీకు పరమేశ్వరుడు దీర్ఘాయురారోగ్యాలు ఇచ్చుగాక" అని సంగం జాగర్లమూడి రైతుసంఘంవారు ప్రార్థించారు, ఆ పత్రంలో.

ఆస్వాగతపత్రానికి ఎడమవైపుగా ఒక మేజామీద ఫొటో ... జాతీయ విత్తనాల సంస్థ విజయవాడ శాఖవారు తీయించుకున్న ఫొటో .... మరి నాలు గడుగులవతలగా భోపాల్‌లోని వారెవరో సంతకాలు చేసిన కృతజ్ఞతా పత్రం .... మరొక చిన్న టేబిల్‌మీద ఫైళ్ళలో వున్నాయి ... అంతకు సుమారు పదిహేడు గంటలముందు ఆఫైళ్ళలో ఒక సంతకం చేయబడింది. ఆసంతకం ఆఫైళ్ళలో ఎన్నో నిర్ణయాలు తీసుకుంది.

ఆసంతకమే అంతకు ముందు దినాలలో, నెలలలో, సంవత్సరాలలో ఎన్నో నిర్ణయాలకు ప్రాణంపోసింది; ఆ సంతకం పోసిన ప్రాణం భారత దేశంలోనికి అన్ని మూలలలోకి ఆశల వెలుతురును ప్రసరింపచేసింది.

కాని ఆ 8— మే మధ్యాహ్నం-అంత వెలుతురునిచ్చిన దీపం అక్కడలేదు.

అందుకనే ఆ నిశ్శబ్దం

అందుకనే ఆ గదిలో నిండినవారి మాటలేని తనం.

అంతకు సుమారు పదమూడు గంటల ముందు ఆ జ్యోతి ఆరి పోయింది

ఆ వెలుతురు, ఆదీక్ష, ఆ అకుంఠిత విశ్వాసం, అనవ్వ చైతన్యం ఆ దూరదృష్టి-ఈలాటి వెయ్యి గుణాలకొక చిన్న రెండక్షరాల పేరుంది.

ఆపేరు "చలం"

* * *

ఆదివారం ... 7 - మే నాడుదయం పదింటికి ఒక మిత్రుడి ఇంట ఓ గంట గడిపి బయటికి వస్తుంటే డాక్టర్ గూడూరు వెంకటచలం ఎదురయ్యారు. నమస్కరించాను.

చిరునవ్వుతో పలకరించారు.

ఆయన మెడచుట్టూ బ్యాండేజీ వుంది.

"ఏదీ చిన్న కురుపండీ ... ఇంజెక్షన్ చేయించుకొస్తున్నాను." అన్నది తన ఆరోగ్యాన్ని బొత్తిగాలక్ష్యం చేయని చలం.

"శివరామన్‌గారిని కలిశా పొద్దుటే..." అన్నది విశ్రాంతి, ఆది వారాలూ ఆఫీసు గంటలూ ఎరుగని, అహోరాత్రాలు పనే ఊపిరిగా బ్రతికిన చలం.

"పాపం ... ఏవేవో అడుగుతుంటారండీ ... ఇంకా చాలా ఉత్తరా లున్నాయి - జవాబివ్వాలి' అన్నది తెలుగుదేశంలోని ఏరైతు పైరుకు ఏమి కావలసివచ్చినా, ఏ ఇల్లాలి పెంపుడు సంపెంగ తీగ పూవులు పూయక పోయినా" ఇట్లాచేయండి "అని సలహా లిచ్చిన చలం.

"ఏమిటో అన్నీ సరిగ్గా కుదిరి ఒక్క రూపానికి వస్తున్న ఈ సమయంలో విభిన్నశక్తులు విభిన్న దశలవైపుకు లాగుతున్నాయి" అని ఆయన అన్నది ఆదినుండి "మంచి"ని చేయబూనిన వారందరికి ఎదురయిన ఆటంకాలను మళ్ళా ఒకసారి ఎదుర్కొన్న చలం; మానవత్వానికి ఆమాడదూరంలో వుండే సర్కారు శాసనాల పద్మవ్యూహంలో ఇరుక్కొని కూడా వాటిని భేదించగలిగిన చలం; ఫైళ్ళ అంధ కారంలో కోడ్ పుస్తకాల ఎడారులలో ఎన్నో ప్రగతినదులు ఇంకిపోయే ఈ మన భారతదేశంలో — యుద్ధరంగంలో ఎక్కడ చూచిన తానుగా కన్పించే మహావీరుడై భారతదేశాన్ని నిజంగా అన్నపూర్ణను చేద్దామన్న ఏకైకలక్ష్యం కోసం అహోరాత్రాలు శ్రమించి. తాను చేయదలచినది ఇంకా ఎంతో వుం డగా, అదంతా చేయడానికి సమయం చాలదేమోనని దిగులుపడిన చలం, ఎయిర్ కండిషనర్ల చల్లదనంలో, వెన్నెలలాంటి ట్యూబ్‌లైట్ల క్రింద ఆరేడ డుగుల పొడవుబల్ల వెనకాల, మెత్తటి దన్నపిల్లోలమీద కూర్చొని సుతారంగా టెలిఫోన్ ఎత్తి "హలో ... మన నెక్స్టు విదేశయాత్ర ఎపుడో చెబుదురూ" అనే అధికార్లు అధిక మవుతున్న రోజులలో రైతులమధ్య తిరిగి, వారితో భోంచేసి 'అదుమ్మను పిల్చి" ఆసమస్యలకు దుఃఖించి, వాటి పరిష్కారా లను వారి కందించి, వారు నవ్వితే తాను నవ్విన చలం.

— పదినిముషాలు మాట్లాడి శలవు తీసుకున్నాను చలంగారి నుండి. అపుడు ఉదయం పదకొండుగంటలు. అది ఆదివారం.

* * *

సోమవారం ఉదయం అందింది వార్త. చలం ఇక లేరు,

దేవలోకంలో దారిద్ర్యం వచ్చింది కాబోలు. వారికి వరి పైరు మీద ఏదో అర్జెంటుగా తేల్చుకో వలసిన సమస్య ఉత్పన్నమయింది కాబోలు - అందుకని చప్పుడు లేకుండా ఆదివారం అర్థరాత్రివేళవచ్చి ఆయనను ఎత్తుకు పోయారు.

పిచ్చివాళ్లు ఆ దేవతలు వాళ్ళు గర్విస్తున్నారు కాబోలు గూడూరి వెంకటచలాన్ని దొంగిలించుకుపోయాము కదా అని,

కాని చలం ఇక్కడే వున్నారు ? కావాలంటే ఆంధ్రలో. బీహారులో. గుజరాతులో. ఒరిస్సాలో మహారాష్ట్రలో - ఎక్కడయినా ఒక వరిమొక్క నడగండి పచ్చగా నవ్వి చెబుతుంది. నేనేచలాన్ని !

ఈ నాట మననోట వరి నలిగినంత కాలం నేడు - రేపు - ఎల్లుండి - మరొక లక్షఏళ్ళు - చలం ఉంటరు !

[ జాతీయ విత్తనాల సంస్థకు మూలపురుషుడయిన గూడూరి వెంకటా చలం పటంకూడా వుండదు నేడు ఢిల్లీలోని ఆ కార్యాలయంలో ! అదే అతడు తమిళుడో, హిందీవాడో అయివుంటే ? .........

—రచయిత ]

★